## మాజీ సర్పంచ్ కుమారుడిని పరామర్శించిన మర్రి


దవాఖానలో సాయిచరణ్‌ను పరామర్శిస్తున్న మర్రి

తిమ్మాజీపేట, జూన్ 1: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గుమ్మకొండ మాజీ సర్పంచ్ సత్యం యాదవ్ కుమారుడు సాయి చరణ్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి, వైద్యులతో ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, హుస్సేన్‌నాయక్, వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

వెల్దండ, జూన్ 1: మండలంలోని రాచూర్‌కు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాచూర్‌కు చెందిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి సికింద్రాబాద్ జింఖాన గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అంతర్జాతీయ క్రీడాకారిణి లావాణ్య అభినందించారు. అనంతరం స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి రావడం అభినందనీయని బీఆర్‌ఎస్ యువనాయకుడు గోకమల్ల రాజు అన్నారు. విజయేందర్ యాదవ్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కల్వకుర్తి, జూన్ 1: హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునే విధంగా మన జీవన విధానాన్ని మార్చుకోవాలని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్టీ చైర్మన్ కల్వ మనోహర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆలయంలో 40రోజులుగా విశ్వ హిందూ పరిషత్, దేవస్థానం సంయుక్తంగా నిర్వహించిన గీతా పారాయణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. 40రోజుల పాటు చిన్నారులకు భగవద్గీత పారాయణం చేయించారు. ముగింపులో భాగంగా ఆలయ చైర్మన్ మనోహర్ మాట్లాడుతూ.. సనాతన ధర్మం యొక్క విలువలను చిన్నారులలో పెంపొందించాలనే ఉద్దేశంతో గీత పారాయణ చేపట్టామని ఆయన వివరించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు రాంభూపాల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య, వరలక్ష్మి తిరుపతయ్య, శ్రీను, రవిచంద్ర, శేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, బాబిదేవ్, యాదగిరి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లట్టుపల్లిని మండల కేంద్రం చేయాలి


అంబేద్కర్ విగ్రహానికి వినతి ఇస్తున్న లట్టుపల్లి గ్రామస్తులు

బిజినేపల్లి, జూన్ 1: లట్టుపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాల క్రితమే తమ గ్రామాన్ని మండలం చేయాలని అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందని, కానీ ప్రస్తుతం తమకు ఎలాంటి సమాచారం లేకుండా మంగనూరును మండల కేంద్రం చేస్తున్నట్లు ప్రకటన చేయడం జరిగిందన్నారు. తమ గ్రామానికి ఆరు గిరిజన గ్రామ పంచాయతీతోపాటు లట్టుపల్లిని కలుపుకొని ఏడు గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. మండల కేంద్రానికి అయ్యే అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గోవిందునాయక్, తిరుపతిరెడ్డి, భూషయ్య, శ్రీనివాసులు, వెంకటయ్య, వేంలాల్, బస్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

SHRIRAM Finance **వాహనములు అమ్మబడును**

| SNo. | VEHICLE NO. | DISCRIPTION | MODEL |
| --- | --- | --- | --- |
| 1 | AP22AM-7571 | MAHINDRA 475-DI | 2013 |
| 2 | TS05EK-3450 | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2015 |

పై వాహనం తేది : 02-06-2025 నాడు వేలం వేయబడును
అడ్రస్: శ్రీరామ్ ఆటో మాల్ యార్డ్, భూత్పూర్, మహబూబ్‌నగర్
**శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
హౌస్ నెం.20-15/4/A/1, 1వ అంతస్థు, శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి కాంప్లెక్స్, LIC ఆఫీస్ ప్రక్కన, నాగర్‌కర్నూల్ రోడ్, అచ్చంపేట -509375. నాగర్‌కర్నూల్ జిల్లా. తెలంగాణ రాష్ట్రం. సెల్: 98483 21685

**WANTED TEACHERS**
DATE : 04-06-25 & 05-06-25 (9:00AM TO 4:00PM)
VENUE : Montessori Residential School - Alampur

| IIT FOUNDATION TEACHERS | | CBSE TEACHERS |
| --- | --- | --- |
| CLASS | SUBJECT | SUBJECT |
| VIII - X | MATH , PHYSICS CHEMISTRY | MATH, PHYSICS, CHEMISTRY, ENGLISH, TELUGU |

1. PG or UG with B. Ed can apply.
2. Send Resume + Self-Intro Video (2 min) by WhatsApp. (9441808648)
3. Selected candidates will be called for Test & Demo at MRS @ Alampur.
4. TA WILL BE PAID for attending the interview.
5. For Info Call : 9014880719 - 99662 46435

NOTE: DSC Applicants can attend the Interview & Report after the exam.
MONTESSORI RESIDENTIAL SCHOOLS
ALAMPUR & PANCHALINGALA – CBSE AFFILIATION NO: 3630378

# ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ సంతోష్


ఆవిర్భావ వేడుకలకు ముస్తాబైన ప్రాంగణం

నాగర్‌కర్నూల్, జూన్ 1: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం 12వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యఅతిథి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి హాజరై ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ చేస్తారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తెలంగాణ వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమ వివరాలను వివరించారు. సోమవారం ఉదయం 9:40 గంటలకు ఎస్పీ వేడుకల ప్రాంగణానికి, 9:45 గంటలకు కలెక్టర్ వేడుకల ప్రాంగణానికి చేరుకుంటారన్నారు. 9:50 గంటలకు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకొని 9:52 గంటలకు అమరవీరులకు నివాళులు, 10: గంటలకు జాతీయ జెండావిష్కరణ, 10: 5 గంటలకు పోలీస్ కవాతు, 10:15 గంటలకు ప్రసంగం ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా ఆవిర్భావ దినోత్సవానికి పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేపట్టారు.

***అచ్చంపేటలో..***

అచ్చంపేటటౌన్, జూన్ 1: నేటి తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరవుతారని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8గంటలకు పట్టణంలోని క్యాంప్ కార్యాలయం, ఎంపీడీవో, తాసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలలో జెండా ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో పరేడ్ మైదానంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు బీకే ప్యాలెస్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించి రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేస్తారని తెలిపారు.

***కోడేరులో..***

కోడేరు, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని తాసీల్దార్ విజయకుమార్ తెలిపారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేయడం జరుగుతుందని, ఈ ఉత్సవాల్లో ప్రతి పౌరులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### హెచ్‌ఎంకు సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

కొల్లాపూర్ రూరల్, జూన్ 1 : పట్టణంలోని బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరయ్య పదవీ విరమణను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌రావు, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు అర్జున్ గౌడ్ సన్మానించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెద్దకొత్తపల్లి, జూన్ 1: మండలంలోని గంట్రావుపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పగడాల చిన్నయ్య ఆదివారం పని నిమిత్తం నాగర్‌కర్నూల్‌కు వెళ్తుండగా సంజీవపూర్ గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నయ్య ప్రయాణిస్తున్న కారు సంజీవపూర్ గేట్ వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడిందని తెలిపారు. చుట్టూ పక్కల పొలాల్లో పనులు చేస్తున్న వారు గమనించి వెంటనే ప్రమాదంలో గాయపడి చిన్నయ్యను నాగర్‌కర్నూల్ ప్రైవేట్ దవాఖానలో తరలించారు.

### పృథ్వీరాజ్‌పై అక్రమ కేసు తొలగించాలి


మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కొల్లాపూర్ రూరల్, జూన్ 1 : బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ పృథ్వీరాజుపై పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలని పార్టీ నాయకులు దాసు, కురుమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపూర్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తిలో ఇరువర్గాల వ్యక్తిగత పంచాయతీలో పృథ్వీరాజ్ ప్రమేయం లేకుండానే అతడిపై అక్రమ కేసు పెట్టడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు అక్రమ కేసులు బనాయిస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, అంజి, లక్ష్మణ్, నాగశేషు, రామకృష్ణ, మధు, కాన్షీరాం తదితరులు పాల్గొన్నారు.

### నేటి ప్రజావాణి వాయిదా : కలెక్టర్

నాగర్‌కర్నూల్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రకటనలో తెలిపారు. తిరిగి జూన్ 9నుంచి ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

### నల్లమల విద్యార్థి ప్రతిభ

అచ్చంపేటరూరల్, జూన్ 1: హైదరాబాద్ జింఖానా మైదానంలో ఆదివారం నిర్వహించిన 11 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణంలోని ఎంఎస్‌ఎన్ పాఠశాల విద్యార్థి శివరామకృష్ణ లాంగ్ జంప్ విభాగంలో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ 300మీటర్ రన్నింగ్ విభాగంలో మెడల్ గెలుపొంది నల్లమల పేరును నిలబెట్టారని పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ మన్సూర్ ఖాన్ తెలిపారు. విద్యార్థికి సర్టిఫికెట్‌తోపాటు గెలుచుకున్న మెడల్స్‌ను అందజేశారు. యాజమాన్యం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మెడల్స్, సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న రత్నాకరం కోటంరాజు

నాగర్‌కర్నూల్, జూన్ 1: కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకరం కోటంరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రూబీ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్మిక సంఘం జిల్లా రెండో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు దఫాల కాలంలో కార్మిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న వెల్ఫేర్ బోర్డు కార్మికుల కష్టంతో వస్తున్న డబ్బులు వారి సంక్షేమం కోసం ఖర్చు చేయకుండా ప్రభుత్వం ఇతర స్కీంలకు మళ్లించి కార్మికుల సొమ్మును దోచుకుంటున్నారన్నారు. దేశానికి సంపద సృష్టికర్తలు కార్మిక వర్గం అయితే కేంద్రం మాత్రం బడా కార్పొరేటర్లకు కొమ్ముకాస్తూ దేశానికి సంపద సృష్టికర్తలు పెట్టుబడిదారులని చెప్పడం కార్మిక వర్గాన్ని అవహేళన చేసేవిధంగా ఉందన్నారు. కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న నిర్వహించే దేశ వ్యాప్తం సార్వతిక సమ్మెలో కార్మిక వర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు రాముడు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, బంగారయ్య, రాములు, బాలస్వామి, వెంకటయ్య, కృష్ణయ్య, ఆంజనేయులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

***భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి***

అచ్చంపేటరూరల్, జూన్1: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా రూ. 5 వేలు పెన్షన్ ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు నేడు సమస్యల నిలయంగా మారిందని వాపోయారు. గోపాల్, మల్లేశ్, కార్మికులు కృష్ణ, చంద్రం, శివరాజు, లక్ష్మయ్య, రాములు, తిరుపతయ్య, సైదమ్మ, శాంతమ్మ, జగన్, దేవేందర్, కృష్ణ, సునిత తదితరులు పాల్గొన్నారు.

### లూజ్ విత్తనాల కేసులో మరికొందరు

- విచారణ చేపడుతున్న పోలీసులు

తిమ్మాజిపేట, జూన్ 1 : తిమ్మాజిపేట మండలం ఆవంచలో లూజ్ సీడ్ పత్తి విత్తనాల పట్టుబడ్డ ఘటనలో పోలీసు అధికారులు విచారణ చేపట్టేకొద్దీ విస్తుపోయే నిజాలు బయటకు వస్తున్నాయి. లూజ్ విత్తనాలు కొన్నేండ్లుగా అమ్ముతున్నట్లు తెలిసింది. వీటిని త్రిబుల్ బీటీ అంటారని, కలుపు మందును తట్టుకునే స్వభావం ఉన్న ఈ మొక్కలతో భూసారం దెబ్బతుంటుందని, కేంద్ర ప్రభుత్వం వీటి అమ్మకాలపై నిషేదం విధించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. నిషేధించిన విత్తనాలను దొంగచాటుగా ఆవంచతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో వందలాది కిలోలు విక్రయించారని తెలిసింది. ఈ ఘటనలో తిమ్మాజిపేట పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా, అతనిచ్చిన సమాచారంతో మరికొందరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై హరిప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా, పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు


అదుపులో తీసుకున్నవారితో స్పెషల్ టీం అధికారులు

కొల్లాపూర్ రూరల్, జూన్ 1 : మండలంలోని ముక్కిడిగుండం, చంద్రబండ గ్రామాల్లో అటవీ భూములను ఆక్రమించి ట్రాక్టర్లతో దున్నించడంపై స్పెషల్ టీం స్ట్రైక్ ఫోర్స్ అధికారి మక్దూమ్, కొల్లాపూర్ ఫారెస్టు రేంజ్ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అనుమతి లేకుండా చెట్లను నరికి 3ట్రాక్టర్లతో భూమిని దున్ని సాగు చేయడానికి ప్రయత్నిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని ట్రాక్టర్లను అచ్చంపేట అటవీ డిపోకు తరలించారు. అడవిలో చెట్లను నరికినా, భూములను స్వాధీనం చేసుకోవాలని చూసినా అటవీ చట్టం 1961 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ ముజీబ్ ఘోరి, సిబ్బంది కాశన్న, శివ, నీలేశ్, జయరాజ్, బయన్న, మల్లేశ్, బీట్ అధికారులు వాల్యానాయక్, నాగార్జున్‌గౌడ్, నవీన్, కిరణ్, లిఖిత, శ్యామ్, మాధవి, రామాంజన్ గౌడ్, మహేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో పోలీస్‌స్టేషన్


వంగూరులో శిథిలావస్థకు చేరిన పోలీస్‌స్టేషన్ భవనం

వంగూరు, జూన్ 1: సీఎం రేవంత్‌రెడ్డి సొంత మండలమైన వంగూరులో పోలీస్ స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరడంతో పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా మారడంతో మూడు సంవత్సరాల నుంచి ఎస్సై క్వార్టర్స్‌లో పోలీస్‌స్టేషన్ నిర్వహిస్తు పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిపడా రూములు లేక సిబ్బంది కూర్చోవడానికి సైతం స్థలం లేక పోవడంతో సిబ్బంది తోపాటు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులు సైతం బయట చెట్ల కింద నిలబడే పరిస్థితి నెలకొంది. నేరస్తులను ఉంచడానికి సైతం రూములు లేక అప్పటి కిచెన్ రూమును వాడుతున్నారు. ప్రభుత్వాలు మారినా పోలీస్‌స్టేషన్‌కు నూతన భవనం మంజూరు కాకపోవడంతో స్టేషన్‌కు వచ్చిన ఎస్సై (ఎస్‌హెచ్‌వో)లు విధిలేని పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు. సీఎం సొంత మండలం కావడంతో ఇప్పుడైనా భవనం మంజూరు చేస్తారనే ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. నూతన భవనం నిర్మించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా శిథిలావస్థకు చేరిన పోలీస్‌స్టేషన్ భవనం స్థానంలో నూతన భవనం నిర్మించి ఎస్సై క్వార్టర్‌కు విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

## 3నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

అచ్చంపేట రూరల్, జూన్ 1: ఈ నెల 3నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు మండలంలోని 38 గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తాసీల్దార్ సైదులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ఈ నెల 3నుంచి 17వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ అధికారులు మూడు టీంలుగా ఏర్పడి సదస్సులలో పాల్గొనున్నట్లు, బాధితుల నుంచి ఆర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు. 3న పుల్జాల, బ్రాహ్మణపల్లి, 4న చందాపూర్, హాజీపూర్ 5న నడింపల్లి, సింగారం 6న రంగాపూర్, బొల్గాట్‌పల్లి 9న బొమ్మనపల్లి, చౌటపల్లి 10న సిద్దాపూర్, పల్కపల్లి 11న ఘణపూర్, గుంపనపల్లి 12న అక్కారం, లక్మాపూర్ 13న అచ్చంపేట, చెన్నారం 16న టంగాపూర్, మన్నెవారిపల్లి 17 ఐనోల్, లింగోటం రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వస్తున్నట్లు పేర్కొన్నారు.

***పెద్దకొత్తపల్లిలో..***

పెద్దకొత్తపల్లి, జూన్ 1: భూ భారతిలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తాసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3నుంచి మండలంలోని రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

***చారకొండలో..***

చారకొండ, జూన్ 1: భూసమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తాసీల్దార్ సునిత ఆదివారం పేర్కొన్నారు. మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో ఈ నెల 3నుంచి 5 వరకు చేపట్టనున్నారు. రెవెన్యూ గ్రామాల్లో 3న కమాల్‌పూర్, శేరి అప్పారెడ్డిపల్లి, 4న చారకొండ, జూపల్లి, 5న తిమ్మాయిపల్లి, గోకారం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు భూసమస్యలు ఉంటే సదస్సులో పరిష్కరించుకోవాలని కోరారు.

### ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలి

అచ్చంపేట, జూన్ 1: ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్, రామస్వామి ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ వేసవి కాలంలో ఉపాధ్యాయులు, అధికారులకు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఎంతో హడావుడి చేస్తూ వేసవిలో శిక్షణ తరగతులు నిర్వహించి, బాధ్యతలు, ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని ఉపాధ్యాయులకు చెబుతూనే మరోపక్క ప్రాథమిక విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే ఈ సర్దుబాటు ప్రక్రియను తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం, తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలు మే నెల ప్రతి శుక్రవారం పెడుతూ ప్రభుత్వ విద్య బలోపేతం చేయాలని సూచిస్తూ, ప్రాథమిక స్థాయిలో 1నుంచి 10మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడని, 10నుంచి 60మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని చెప్పడం ఒక అశాస్త్రీయమైన, అసంబద్ధమైన విధానాలను డీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.


ఆర్థిక సాయం అందిస్తున్న గోవర్ధన్

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కల్వకుర్తి, జూన్ 1: కల్వకుర్తి మున్సిపాలిటీలోని బాల్‌రాంనగర్‌కు చెందిన నాగమ్మ కుటుంబానికి ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం రాత్రి నాగమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు రామస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు సాయన్న, రామకృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత

బిజినేపల్లి, జూన్ 1: మండలంలోని మమ్మాయిపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్త చిన్నగట్టు కుమారుడు నర్సింహ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఆదివారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుర్మయ్య పరామర్శించారు. మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

వెల్దండ, జూన్ 1: సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరం లాంటిదని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆయా మండలాలకు చెందిన 22మంది లబ్ధిదారులకు రూ.6.70లక్షల చెక్కులను రాఘవేందర్‌రెడ్డి అందజేశారు. అనంతరం వెల్దండ మండలం నగరాగడ్డతండా మాజీ సర్పంచ్ దశరథ్ నాయక్ తండ్రి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రమేశ్‌నాయక్, లాలు, వెంకట్‌నాయక్ తదితరులు ఉన్నారు.

### కేశ్యతండాలో తెగిపడిన విద్యుత్ తీగలు

- సరఫరాకు అంతరాయం


తెగిపడిన విద్యుత్ తీగలు

అచ్చంపేటరూరల్, జూన్ 1: మండలంలోని మన్నెవారిపల్లి, మార్లపాడు తండా గ్రామ పంచాయతీ శివారు కేశ్యతండా సమీపంలోని విద్యుత్ తీగలు తెగిపడడంతో తండాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. రెండు రోజుల కిందట తీగలు తెగిపడగా విద్యుత్ అధికారులకు సమాచారం అందించిన వారు స్పందించడం లేదని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

వెల్దండ, జూన్ 1: మండలంలోని కంటోన్‌పల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి గ్రామ మాజీ సర్పంచ్ పెద్ది రామకృష్ణ ఆదివారం భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెలే ప్రత్యేక నిధులు రూ.10 లక్షలతో సీసీరోడ్డు, రూ.15 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఏఈ సురేందర్, కార్యదర్శి ఫయాజ్, బాలస్వామిగౌడ్, కృష్ణయ్యగౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బిజినేపల్లి, జూన్ 1: ప్రస్తుతం వచ్చే ఆధునిక కాలానికి అనుగుణంగా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని బస్వలింగం, చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని పాలెంలో టీఎస్ఎం హైస్కూల్ పాఠశాలలో 29రోజులుగా విద్యార్థులకు 1991–96 పూర్వ విద్యార్థులు స్థానిక ప్రస్తుత విద్యార్థులకు చిత్ర లేఖనం, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలపై వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సురేశ్‌బాబు, చంద్రశేఖర్, తిరుపతయ్య, మధుసూదన్, ప్రమోద్‌కుమార్, బుచ్చయ్య, జగత్‌రెడ్డి రాములు, నర్సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బాలానగర్ (రాజాపూర్), జూన్ 1 : రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిర్మలగిరిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివానందం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తిర్మలగిరికి చెందిన రామచంద్రయ్య(54) జడ్చర్ల మున్సిపాలిటీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రామచంద్రయ్య భార్య మైసమ్మ జడ్చర్లలో ఉంటున్న మనవరాలు సహస్ర ఆరోగ్య బాగాలేకపోవడంతో మే 28వ తేదీన కుమార్తె సుశీల వద్దకు వెళ్లింది. ఇంటిదగ్గర ఉన్న రామచంద్రయ్య శనివారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో పడుకున్న చోటే మృతి చెందాడు. సమాచారం అందుకుని తిర్మలగిరికి వచ్చిన మైసమ్మ భర్త రామచంద్రయ్య మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మూసాపేట, జూన్ 1 : బాత్‌రూంలో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మూసాపేట ఎస్సై వేణు తెలిపారు. ఎస్సై కథనం మేరకు మండలంలోని మహ్మదూస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన కంతి కాశన్న(55) శనివారం భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. అందుకు మానస్తాపం చెందిన కాశన్న శనివారం రాత్రి అందరూ పడుకున్న తర్వాత బాత్‌రూంలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. ఉదయం కుమారుడు మహేశ్ చూసి కుటుంబ సభ్యులకు చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి పోలీసులు వెళ్లి పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని శవ పరీక్షలకు నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.